# ఫిర్యాదులపై తక్షణ స్పందన

- ఎస్పీ రితిరాజ్



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, డిసెంబర్ 18 : బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎస్పీ రితిరాజ్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకొని ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు సమస్యలను పరిష్కారించాలని ఆదేశించారు.

### నేరాలపై దృష్టి సారించాలి

వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ రితిరాజ్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో సర్కిల్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నమోదైన ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చేయాలని సూచించారు. అలాగే అనుమానిత ప్రాంతాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు నిఘా పెంచాలని సూచించారు. ఈ నెలలో నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశం ఉన్న కేసులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారులు శివకుమార్, శ్రీనివాస్, శివశంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి

- ఏడీఏ సక్రియా నాయక్

అలంపూర్, డిసెంబర్ 18: క్రిమి సంహారక మందులు ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని ఏడీఏ సక్రియా నాయక్ డీలర్లకు సూచించారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలోని రైతుల వేదికలో సోమవారం ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయాల్లో నిబంధనలు పాటించాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏవో అనిత, ఏఈవో సాయిరాం, డీలర్లు లక్ష్మన్న, జయరాంరెడ్డి, వెంకట్రాముడు, రవిరెడ్డి, మహేశ్వరెడ్డి, బాలపీరు, దేవేందర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలి

అయిజ, డిసెంబర్ 18 : హరితహారంలో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని ఎంపీడీవో సాయిప్రకాశ్ కార్యదర్శులు, వన సేవకులకు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని ఉప్పల గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సరీల్లో మట్టి నింపడం, విత్తనాలు నాటడం వంటి పనులు వేగవంతం చేయాలన్నారు. మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నర్సరీల పరిశీలన

మల్దకల్, డిసెంబర్ 18 : మండలంలోని అమరవాయి, దాసర్‌పల్లి, బిజ్వారం గ్రామాల్లోని నర్సరీలను సోమవారం ఎంపీడీవో కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వన సేవకులతో మాట్లాడుతూ ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు పెంచాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రామిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్, వన సేవకుడు రంగన్న, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

మల్దకల్, డిసెంబర్ 18 : మండలంలోని మేకలసోపంపల్లి, పాల్వాయి, మల్దకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం సీడీపీవో కమలాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో చిన్నారుల హాజరు పట్టిక, మెనూ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 6 నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు మాత్రమే బాలామృతం, 16 గుడ్లు ఇస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా అధికారి రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించండి

రాజోళి, డిసెంబర్ 18: తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలంటూ మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామస్తులు గద్వాల డిపో మేనేజర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు సమాయానికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయిజ నుంచి నసనూర్ మీదుగా, రాజోళి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులు, గ్రామస్తుల ఇబ్బందులు తొలగించాలని డిపో మేనేజర్‌ను కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి, చిన్న తిమ్మప్ప, వీరన్నగౌడ్, రాముడు, దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దు

- కలెక్టర్ వల్లూరి క్రాంతి
- ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి

గద్వాల, డిసెంబర్ 18: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ సమావేశ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి మొత్తం 85ఫిర్యాదులు వచ్చాయని అందులో ధరణి, భూసంబంధ ఫిర్యాదులు 57, పెన్షన్లు 8, ఇతర సమస్యలపై 20 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల ఫిర్యాదులను కలెక్టర్ నేరుగా పరిశీలించి సంబంధిత తాసీల్దార్లతో మాట్లాడి ఆన్‌లైన్ రికార్డులను,క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు. భూ,ఇతర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఫిర్యాదు దారులకు భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్,శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధికి విరాళం

కోయిల్‌దిన్నె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు జి.కాంతారెడ్డి సీఎం సహాయనిధికి రూ.2లక్షల విరాళం అందజేశారు. సోమవారం ఆయన కలెక్టర్‌కు రూ. 2లక్షల డీడీని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తనకు వచ్చే ఆదాయంలో సీఎం సహాయనిధికి విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలన్నారు.

### పోలింగ్ కేంద్రాల మార్పు,చేర్పులకు ప్రతిపాదనలు

జిల్లాలోని ఓటర్ల సౌకర్యార్థం పలు పోలింగ్ కేంద్రాల మార్పులు,చేర్పులకు ప్రతి పాదనలు రూపొందించనున్నట్లు కలెక్టర్ క్రాంతి అన్నారు. సోమవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్‌హాల్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గాల వారిగా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒకే పోలింగ్ స్టేషన్‌లో విలీనం అయ్యే పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలపై చర్చించారు. జిల్లాలో 1,400 పైగా ఓటర్లు కలిగి ఉన్న పోలింగ్ స్టేషన్ల పరిధిలో, కొత్తగా ఏర్పడిన కాలనీల పరిధిలో, రెండు కిలోమీటర్లు, అంతకంటే ఎక్కువ దూరంలో ఉన్న పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తూ కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతి పాదనలు రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మార్పులు,చేర్పులు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను ఓటర్లకు తెలియజేయాలని రాజకీయపార్టీల నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు ప్రస్తావించిన పలు అంశాలు, సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, అపూర్వచౌహాన్, తాసీల్దార్లు మంజుల, విజయ్‌కుమార్, సీ సెక్షన్ అధికారి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా తిమ్మప్పస్వామి పల్లకీ సేవ

మల్దకల్, డిసెంబర్ 18 : మల్దకల్‌లో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి (తిమ్మప్పస్వామి ) బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం రాత్రి స్వామి వారి పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి కులస్తులు దశమి కట్ట వద్ద స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యా చంద్రారెడ్డి, బాబురావు, ధీరేంద్రదాస్, వెంకోబరావు, అర్చకులు భీమ్‌సేనాచారి, మధుసూదనాచారి, రమేశ్‌చారి, రవిచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

గద్వాలటౌన్, డిసెంబర్ 18: జిల్లా కేంద్రం సమీపంలో పిలిగుండ్ల ముడుపుల ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం శ్రీవల్లిదేవసేన సహిత సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు కృష్ణసాగర్ య్యర్, కుమారస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సమావేశం

ధరూరు, డిసెంబర్ 18 : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ నజుమున్నీసాబేగం అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదిక చదివి వినిపించారు. పంచాయతీ కార్యదర్శులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు అధికారుల సమన్వయంతో గ్రామీణ ప్రగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్‌పర్సన్ మహాదేవమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి క్రీడాకారుడికి లక్ష్యం ఉండాలి

- డీవైఎస్‌వో ఆనంద్

గద్వాలటౌన్, డిసెంబర్ 18: ప్రతి క్రీడాకారుడికి ఒక లక్ష్యం ఉండాలని అప్పుడే పోటీల్లో రాణిస్తారని డీవైఎస్‌వో ఆనంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్, సోమనాద్రి స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్ 19 క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో హైదరాబాద్ జట్టు విజయం సాధించగా రెండో స్థానంలో మహబూబ్‌నగర్ జట్టు నిలచింది. అనంత రం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్టుకు బహుమతి అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు రాంగోపాల్, ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి, జిల్లా కార్యదర్శి జితేందర్, పీఈటీలు తది తరులు పాల్గొన్నారు.

## నేడు దివ్యాంగుల దినోత్సవం

గద్వాల అర్బన్, డిసెంబర్ 18 : జిల్లా కేంద్రలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ముషాహిదా బేగం సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.

## జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు, డిసెంబర్ 18 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి స్వల్పంగా వరద కొనసాగుతున్నది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 585 క్యూసెక్కులు వస్తుండగ, కుడి కాల్వ ద్వారా 88 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 168 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 7.645 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.938 టీఎంసీల నీటి మట్టం ఉంది.

## ఆర్డీఎస్‌లో తగ్గుతున్న నీటి మట్టం

అయిజ, డిసెంబర్ 18 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ క్రమంగా తగ్గుతున్నది. ఎగువ నుంచి నీటి ప్రవాహం నిలిచిపోవడంతో సోమవారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 285 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 5.5 అడుగుల మేర నీరు నిలువ ఉన్నట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి విడుదల కొనసాగుతుందని పేర్కొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.

NT-314474

**EMI PLOTS**

★ EMI Plots in Jadcherla MUDA Approved Layout. గజం: 8,000/- రూ.లకే, 100 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌కి అతి చేరువలో, నెలసరి వాయిదా పద్ధతిలో 10,000/- రూ.లకే ప్లాట్లు పొందవచ్చు. స్పాట్ రిజి॥. 7780483434.

NT-314492

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794